

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి సోమవారం 7-09-2026 సంపుటి: 02 సంచిక : 128 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Monday, 7-09-2026 Volume :02 Issue: 128 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777


# జల యుద్ధానికి సిద్ధం కండి

కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై సర్కార్‌ను నిలదీయండి



- సాగునీటి సమస్యలపై అసెంబ్లీని స్తంభింపజేయండి
- లక్షల మందితో ప్రత్యక్ష కార్యాచరణ రూపొందిస్తాం
- 22ఏ భూములు, నిరుద్యోగం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రశ్నించాలి
- ఎర్రవెల్లిలో బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశంలో కేసీఆర్

**అసెంబ్లీ సమావేశాల వేళ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ 'జలయుద్ధం'కు పిలుపునిచ్చారు. కాళేశ్వరం, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టులతోపాటు సాగునీరు, తాగునీటి సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉభయ సభల్లో నిలదీయాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. సాగునీటి అంశంపై అసెంబ్లీని స్తంభింపజేయడంతోపాటు 22ఏ భూములు, నిరుద్యోగం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, ఉద్యోగుల సమస్యలు తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ఎండగట్టాలని సూచించారు. త్వరలో లక్షలాది మందితో ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని కేసీఆర్ ప్రకటించారు.**

హైదరాబాద్,

తెలంగాణకు సాగునీటి విషయంలో జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు 'జలయుద్ధం'కు సిద్ధం కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ఎర్రవెల్లిలో శాసనసభ్యులతో సమావేశమైన ఆయన... కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు సాగునీరు, తాగునీటి సమస్యలపై ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించాలని సూచించారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ చేస్తున్నవన్నీ దుష్ప్రచారాలేనని, కుట్రపూరితంగా నీటిని ఎత్తిపోసే

-మిగతా 2 లో



02

## ఇజ్రాయిల్‌పై భారీ దాడికి ఇరాన్ వ్యూహం

- హిజ్బుల్లా, హమాస్, హూతీలతో సమన్వయం
- అన్ని వైపుల నుంచి ఏకకాలంలో దాడికి ప్లాన్
- 2023 దాడి కంటే తీవ్రంగా ఉండొచ్చని హెచ్చరిక
- ఇరాన్--హమాస్ మధ్య బలపడుతున్న సంబంధాలు
- ఇజ్రాయిల్‌పై ప్రతీకారానికి ప్రత్యేక బృందాలు
- మిత్రదేశాల కమాండర్లతో ఐఆర్‌జీసీ చర్చలు
- క్షిపణులు, డ్రోన్ల ఉత్పత్తికి మరింత వేగం
- అణు సామర్థ్యాల పునరుద్ధరణపై ఇరాన్ దృష్టి



## ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

- ఈహెచ్‌ఎస్ అమల్లో రాజీ లేదు : భట్టి
- ఉద్యోగుల ఆరోగ్యమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం
- ఆరోగ్య కార్డుల జారీని వేగవంతం చేయాలి
- 354 ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈహెచ్‌ఎస్ సేవలు
- మరిన్ని ఆస్పత్రులను చేర్చేందుకు చర్యలు
- ఉద్యోగ సంఘాల సూచనలతో పథకం రూపకల్పన
- దశాబ్దాల సమస్యకు మానవీయ పరిష్కారం
- పథకం అమలుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ
- ఉద్యోగులు, కుటుంబాల ఆరోగ్య భద్రతకు భరోసా
- ఈహెచ్‌ఎస్ విజయవంతం చేయడం అందరి బాధ్యత

హైదరాబాద్

ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం పట్ల ఎంతో పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని మహాత్మా జోతిబాపూలే ప్రజాభవన్‌లో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ట్రస్ట్ బోర్డు (ఈహెచ్‌సీటీ) సభ్యులు, ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, వారి

-మిగతా 2 లో



02

## కొత్త ప్రపంచ పటంపై భారత్ అభ్యంతరం

- జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌ను అధికారిక పటం ప్రకారమే చూపాలి
- ఐరాస ప్రతిపాదనపై విదేశాంగ శాఖ స్పష్టీకరణ
- సరిహద్దులు, వివాదాస్పద ప్రాంతాలపై నిర్ణయాలేవీ లేవు
- దేశాల వాస్తవ భూభాగ వైశాల్యాన్ని చూపడమే లక్ష్యం
- భారత భూభాగాన్ని తప్పుగా చూపించే అవకాశం ఉందని ఆందోళన
- సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతపై భారత్ స్పష్టమైన వైఖరి
- భూభాగ వైశాల్యం ఆధారంగా రూపొందించే పటానికి భారత్ మద్దతు

# నేటి నుంచి అసెంబ్లీ

**ఉదయం 10 గంటలకు ఉభయ సభల ప్రారంభం**

- తొలుత ప్రశ్నోత్తరాలు.. ఆ తర్వాత కీలక నివేదికలు
- పీఎం శ్రీ, సమగ్ర శిక్ష వార్షిక నివేదికలు ప్రవేశపెట్టనున్న సీఎం
- హైదరాబాద్ మెట్రో రైల్ నివేదికలకూ సభలో చోటు
- సభ ఎన్నిరోజులు నిర్వహించాలనేది నేడు బీఏసీ భేటీలో నిర్ణయం
- ఈ నెల 11 వరకే సమావేశాలు కొనసాగే అవకాశం
- వరుస సెలవులతో ముందుగానే ముగించే యోచన
- మాజీ ఎమ్మెల్యేలకు సంతాపం తెలిపే అంశంపై ఉత్కంఠ
- సీడబ్ల్యూసీ భేటీకి సీఎం హాజరవుతారా?
- తెలంగాణ--ఏపీ నదీజలాల అంశాలపై చర్చకు అవకాశం
- ఒకే ప్రాంగణంలో శాసనసభ, మండలి
- 24 ఏళ్ల తర్వాత జూబ్లీహాల్‌కు వీడ్కోలు
- పార్లమెంట్ తరహాలో సెంట్రల్ హాల్ ఏర్పాటు
- మీడియా అనుమతిపై కొనసాగుతున్న సందిగ్ధత

**తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. శాసనసభ, శాసనమండలి తొలిసారిగా ఒకే ప్రాంగణంలో కొలువుదీరనున్న ఈ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ సమగ్ర శిక్ష, పీఎం శ్రీ పథకాలతోపాటు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించిన వార్షిక నివేదికలను సభలో ప్రవేశపెట్టనున్నారు. అనంతరం బీఏసీ సమావేశమై సభ నిర్వహణ రోజులపై నిర్ణయం తీసుకోనుంది. మూడు రోజుల వరుస సెలవుల నేపథ్యంలో ఈ నెల 11 వరకే సమావేశాలు జరిగే అవకాశం ఉంది.**

హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన శాసనమండలి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన శాసనసభ ఆరంభం కాను న్నాయి. ఉభయ సభల్లో తొలుత ప్రశ్నోత్తరాలను చేపట్టనున్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి... తెలంగాణ సమగ్ర శిక్ష (టీ.ఎస్.ఎస్), పీఎం శ్రీ పథకంతోపాటు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు సంబంధించి 2013 ఆర్థిక సంవత్సరం నుంచి 2018 వరకు వార్షిక నివేదికను సభలో ప్రవేశపెట్టనున్నారు.

-మిగతా 2 లో






## జీతం తీసుకుంటూ అసెంబ్లీకి ఎందుకు రారు

- ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్న కేసీఆర్
- తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి
- మహాధర్నాలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ డిమాండ్
- బీఆర్ ఎస్ పదేండ్ల పాలన.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనపై చర్చకు సిద్ధమంటూ సవాల్
- హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, అజారుద్దీన్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు

హైదరాబాద్

ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీకి రాని బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్... ఆ హోదాను అపహాస్యం చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న ఆయన సభకు రాకపోవటం అత్యంత శోచనీయమని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలంటూ ఆయన కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఇదే అంశంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావు సారథ్యంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ రెడ్డి, మాజీ ఎంపీలు మధుయాష్కీ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ...'పదేండ్ల పాలనలో

-మిగతా 2 లో



02

## అమెరికాలోనూ 'సర్'..

- ఓటర్ల జాబితాల సమీక్షకు ట్రంప్ సర్కారు సిద్ధం
- 10 లక్షల మంది భారత సంతతి ఓటర్లపై తొలగింపు ముప్పు?
- ఓటర్ల జాబితాల సమగ్ర పరిశీలనకు రూ.125 కోట్ల నిధులు
- నవంబర్ మధ్యంతర ఎన్నికల్లోపు ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యం
- బాధ్యతను ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)కి అప్పగించిన ట్రంప్
- 50 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల పరిశీలన, నవీకరణ
- ప్రభుత్వ రికార్డులతో ఓటర్ల సమాచారాన్ని సరిపోల్చనున్న కంప్యూటర్లు
- వివరాల్లో తేడాలుంటే పునఃపరిశీలన.. తొలగింపునకు అవకాశం

## మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్

- 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యం
- నాలుగు స్థాయిల్లో నార్కో సమన్వయ కేంద్రాలు
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లు
- ఎన్‌సీబీ పునర్వ్యవస్థీకరణ.. నిదాన్ పోర్టల్‌తో జాతీయ డేటాబేస్
- చిన్న ప్యాకెట్ పట్టుబడినా మొత్తం నెట్‌వర్క్ వెలికితీత
- 2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌ల ధ్వంసం
- 36 దేశాల నుంచి 274 మంది నేరస్థులను భారత్‌కు తీసుకొచ్చాం
- నక్సలిజం తరహాలో డ్రగ్స్ ముప్పును అంతం చేస్తాం: అమిత్ షా



02

## మెట్రో రంగంలో భారత్ మరో మైలురాయి

- రెండేళ్లలో అమెరికాను దాటనున్న భారత్
- చైనా తర్వాత రెండో స్థానంపై కన్ను
- 26 నగరాలకు విస్తరించిన మెట్రో సేవలు
- 1,170 కిలోమీటర్లకు చేరిన మెట్రో నెట్‌వర్క్
- 12 ఏళ్లలో ఐదు రెట్లు పెరిగిన నెట్‌వర్క్
- కొత్త ప్రాజెక్టులతో మరింత వేగంగా విస్తరణ
- ప్రపంచంలో మూడో స్థానంలో భారత్
- నిర్మాణంలో ఉన్న మార్గాలతో పెరగనున్న నెట్‌వర్క్



02

# ఇజ్రాయిల్‌పై భారీ దాడికి ఇరాన్ వ్యూహం



**-హిజ్బుల్లా, హమాస్, హూతీలతో సమన్వయం**
**-అన్ని వైపుల నుంచి ఏకకాలంలో దాడికి ప్లాన్**
**-2023 దాడి కంటే తీవ్రంగా ఉండొచ్చని హెచ్చరిక**
**-ఇరాన్--హమాస్ మధ్య బలపడుతున్న సంబంధాలు**
**-ఇజ్రాయిల్‌పై ప్రతీకారానికి ప్రత్యేక బృందాలు**
**-మిత్రదేశాల కమాండర్లతో ఐఆర్‌జీసీ చర్చలు**
**-క్షిపణులు, డ్రోన్ల ఉత్పత్తికి మరింత వేగం**
**-అణు సామర్థ్యాల పునరుద్ధరణపై ఇరాన్ దృష్టి**

టెహ్రాన్:
అమెరికాతో కలిసి..తమ దేశంపై యుద్ధోన్మాదానికి దిగిన ఇజ్రాయిల్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని ఇరాన్ ఎదురు చూస్తోంది. తమ దేశాధినేతల మరణానికి కారణమైన వారిని అంతం చేస్తామని పలుమార్లు హెచ్చరించింది. ఈ క్రమంలో ఇజ్రాయిల్ నిఘా వర్గాలు కీలక విషయాలు వెల్లడించాయి. తమ దేశంపై భారీ స్థాయిలో దాడులు చేపట్టడానికి ఇరాన్ ప్రణాళిక రచిస్తున్నట్లు ఇజ్రాయిల్ నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అన్ని వైపుల నుంచి ఏకకాలంలో తమను లక్ష్యం చేసుకోవడానికి ఇరాన్.. హిజ్బుల్లా, హమాస్, హూతీలు, ఇరాక్‌లోని సాయుధ ముఠాల తో జట్టు కడుతోందని ఆరోపించాయి. భవిష్య త్తులో జరగబోయే ఈ దాడి 2023 అక్టోబర్ 7న హమాస్ దాడికంటే తీవ్రంగా ఉండే అవకాశం ఉందని తెలిపాయి. ఇందులో భాగంగా ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ తన బలగాలను లెబనాన్‌లోని హెజ్బుల్లా, హమాస్, యెమెన్‌లోని హూతీలతో కలిపి మోహరించాలని భావిస్తున్నట్లు వెల్లడించాయి. దీంతో ఇజ్రాయిల్ ప్రధాని వెన్నులో **వణుకు పుట్టిస్తోంది.**

నిఘా వర్గాల ప్రకారం.. 2023 అక్టోబర్ 7న హమాస్ అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయింది. దీంతో ఈసారి మిత్రదేశాలతో కలిసి.. ఇజ్రాయిల్‌పై దాడులకు ప్రణాళికలు రచిస్తోంది. ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేయాలనేది వారి ప్లాన్. ఈ పరిస్థితులకు హమాస్ నాయకత్వంలో వచ్చిన మార్పు కూడా ఓ కారణం. జులైలో హమాస్ అత్యున్నత నాయకుడిగా ఎన్నికైన ఖలీల్ అల్-హయ్యాకు ఇరాన్‌తో మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో ఇజ్రాయిల్‌పై పగ తీర్చుకోవడానికి ఇరువురు ఏకమయ్యాయి. ఈ దాడి కోసం ఇరాన్ కొన్ని బృందాలను, సమన్వయ యంత్రాంగాలను కూడా సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.

**మరింత వేగంగా ఆయుధాల ఉత్పత్తి**

ఇజ్రాయిల్‌తో ఘర్షణను విస్తరించడంపై హిజ్బుల్లా, హూతీలు, ఇరాకీ మిలీషియాలలోని కమాండర్లతో ఐఆర్‌జీసీ ఖుద్స్ ఫోర్స్ ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. ఐఆర్‌జీసీకి చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు, ఖుద్స్ ఫోర్స్ సీనియర్ అధికారులు, ఇతర కమాండర్లతో కాన్ఫరెన్స్ కాల్స్ నిర్వహించారు. అలాగే ఇరాన్ సలహాదారులు కూడా క్షేత్రస్థాయిలో వారితో కలిసి పనిచేశారు. అదే సమయంలో క్షిపణులు, డ్రోన్ల ఉత్పత్తిని వేగవంతం చేయడానికి, దెబ్బతిన్న అణు సామర్థ్యాలను పునరుద్ధరించడానికి ఇరాన్ ప్రయత్నిస్తోంది.

# నేటి నుంచి అసెంబ్లీ

మొదటి తరువాయి

ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతి బులెటిన్ విడుదల చేశారు. అనంతరం సభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశమై సభను ఎన్నిరోజులు నడపాలనే దానిపై చర్చించి, నిర్ణయం తీసుకుంటుంది. అయితే ఈనెల 11 వరకే సభ కొనసాగే అవకాశాలున్నాయని సమాచారం. ఆ తర్వాత వరసగా మూడు రోజుల(రెండో శనివారం, ఆదివారం, సోమవారం వినాయక చవితి)పాటు వరసగా సెలవులు రానుండటమే దీనికి కారణమని అసెంబ్లీ కార్యదర్శి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

కాగా ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యేలు కొమ్మిడి నర్సింహారెడ్డి (భువనగిరి), పెద్ది సుదర్శన్ రెడ్డి (నర్సంపేట)లకు శాసనసభ సంతాపం తెలపాల్సి ఉంది. కానీ అసెంబ్లీ కార్యదర్శి విడుదల చేసిన బులెటిన్‌లో ఆ ప్రస్తావనేదీ లేదు. అంటే తొలిరోజు గాకుండా ఆ తర్వాత వారికి సంతాపాన్ని తెలిపే అవకాశముందా? లేదా? అనేది చూడాలి. మరోవైపు ఢిల్లీలో సోమవారం నిర్వహించబోయే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. ఆ భేటీలో తెలంగాణ, ఏపీకి సంబంధించిన నదీ జలాలపై చర్చ జరిగే అవకాశమున్న నేపథ్యంలో అది అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ?


ఒకే ప్రాంగణంలో శాసనసభ, మండలి...

ఈసారి అసెంబ్లీ సమావేశాలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇప్పటి వరకూ పబ్లిక్ గార్డెన్స్‌లోని జూబ్లీహాల్ లో కొనసాగిన శాసనమండలి, శాసనసభ భవనం పక్కనే కొలువుదీరనుంది. పాత శాసనసభ భవనం, గతంలో టీడీఎల్పీకి ఉపయోగించుకున్న భవనాలకు మరమ్మతులు చేసిన ప్రభుత్వం... వాటిని కౌన్సిల్ కు కేటాయించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ హయాం నుంచి ఇప్పటిదాకా 24 ఏండ్లపాటు జూబ్లీహాల్‌లో కొనసాగిన శాసనమండలి, ఇప్పుడు శాసనసభ పక్కకే రానుంది. రెండు సభల మధ్యనున్న లాంజ్‌ను పార్లమెంటులో మాదిరిగా సెంట్రల్ హాల్‌లాగా ఉపయోగించనున్నారు. ఈ రీత్యా మీడియా ప్రతినిధులను గతంలో మాదిరిగా లోనికి అనుమతిస్తారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది

# మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్

**-2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యం**
**-నాలుగు స్థాయిల్లో నార్కో సమన్వయ కేంద్రాలు**
**-రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లు**
**-ఎన్‌సీబీ పునర్వ్యవస్థీకరణ.. నిదాన్ పోర్టల్‌తో జాతీయ డేటాబేస్**
**-చిన్న ప్యాకెట్ పట్టుబడినా మొత్తం నెట్‌వర్క్ వెలికితీత**
**-2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌ల ధ్వంసం**
**-36 దేశాల నుంచి 274 మంది నేరస్థులను భారత్‌కు తీసుకొచ్చాం**
**-నక్సలిజం తరహాలో డ్రగ్స్ ముప్పును అంతం చేస్తాం: అమిత్ షా**

పనాజీ



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదివారం గోవాలో మీడియాతో మాట్లాడుతూ, 2029 నాటికి భారతదేశాన్ని పూర్తిగా మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. మాదకద్రవ్యాలు లేని యువశక్తి 2047 నాటికి వికసిత భారత్ను నడిపిస్తుందనేది ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని పేర్కొన్నారు. నక్సలిజం, ఉగ్రవాదం వంటి ముప్పులను ఎలా అరికట్టామో, అదే పద్ధతిలో మాదకద్రవ్యాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతా మని ధీమా వ్యక్తం చేశారు. 2014కు ముందు మాదకద్రవ్యాలపై పోరాటం చిన్న చిన్న విభాగాల్లో, ఒంటరిగా సాగేదని, ఏజెన్సీలు చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవని అమిత్ షా గుర్తు చేశారు. డ్రగ్స్ పై ఈ పోరాటాన్ని జాతీయ భద్రతా ప్రాధాన్యతగా మోదీ ప్రభుత్వం మార్చిందని చెప్పారు.

నాలుగు స్థాయిల్లో నార్కో సమన్వయ కేంద్రాలు

2019లో నాలుగు స్థాయిల నార్కో సమన్వయ కేంద్రం ఏర్పాటు చేశారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదకద్రవ్య నిరోధక టాస్క్ ఫోర్సను ఏర్పాటు చేశారు. మాదకద్రవ్య నియంత్రణ బ్యూరోను పునర్వ్యవస్థీకరించి బలోపేతం చేశారు. నిదాన్ పోర్టల్ ద్వారా నేరస్థుల జాతీయ డేటాబేస్ సృష్టించారు. 1933 మానస్ హెల్ప్ లైన్ ప్రారంభించి బాధితుల యువతకు పునరావాసం అందిస్తున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు.

చిన్న ప్యాకెట్ తో నెట్వర్క్ వెలికితీత

కార్యాచరణ ప్రణాళిక నాలుగు స్తంభాలపై ఆధారపడి ఉంది. మేధస్సు, కార్యాచరణ ఆధారిత అమలు, సింథటిక్ మాదకద్రవ్యాలు, పూర్వగామి రసాయనాల నియంత్రణ, డిమాండ్ తగ్గింపు, హాని తగ్గింపు, సామర్థ్య నిర్మాణం, సమన్వయం. దిగువ నుంచి పైకి, పై నుంచి కిందికి దర్యాప్తు విధానం అవలంబిస్తున్నారని అమిత్ షా తెలిపారు. చిన్న ప్యాకెట్ స్వాధీనం చేసుకున్నా మొత్తం నెట్వర్కు వెలికితీస్తారు. సరిహద్దుల్లో పెద్ద సరుకు పట్టుకున్నా వినియోగదారు వరకు జాడ వెతుకుతారని కేంద్ర మంత్రి చెప్పారు.

# జీతం తీసుకుంటూ అసెంబ్లీకి ఎందుకు రారు

మొదటి తరువాయి



బీఆర్ ఎస్ రాష్ట్రానికి ఏం ఒరగబెట్టిందో.. రెండున్నరేండ్లలో కాంగ్రెస్ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందో చర్చించేందుకు మేం సిద్ధం.. మీరు సిద్ధమా...?' అని కేసీఆర్‌కు సవాల్ విసిరారు.

**బీఆర్ ఎస్ పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు...**

గత ఎన్నికల్లో కాంగ్రెస్?ను ఆశీర్వదించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్?కు ప్రతిపక్ష బాధ్యత ఇచ్చారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానిది కీలక పాత్ర అని చెప్పారు. కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఇస్తే ఆయన అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తున్నారని ఎద్దేవా చేశారు. అందుకే ఎమ్మెల్యే పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో చెప్పాలని కేసీఆర్ ను నిలదీశారు. అధికారం ప్రజలిచ్చే కానుకని, వారి ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగానే తమ ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ప్రజలకిచ్చిన మాటకు కట్టుబడి అనేక హామీలను అమలు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లిస్తామని చెప్పి ముఖం చాటేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు భిన్నంగా ఇండ్లు లేని వారికి ఇండ్లు కట్టించటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులకు చదువుతో పాటు సంస్కారం అవసరమని హితవు పలికారు. పదేండ్ల కాలంలో విదేశీ పెట్టుబడులు ఏ మేరకు తెచ్చారో చెప్పాలని నిలదీశారు.తాము రెండున్నరేండ్లలో రూ.లక్షా 78వేల కోట్లు విదేశీ పెట్టుబడులతోపాటు గ్లోబల్ సమ్మిట్‌తో రూ. ఐదు లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. 70వేలకు పైగా ఉద్యోగాలను ఇచ్చామని, ఇంకో రెండున్నరేండ్లలో మరిన్ని ఉద్యోగాలు ఇచ్చితీరుతామని హామీనిచ్చారు. ఉద్యమకారులు గద్దర్, అందెశ్రీని కేసీఆర్ విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ తమ ప్రభుత్వం వారిని సముచితంగా గౌరవించిందని గుర్తు చేశారు. కుల సర్వేతో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని వివరించారు. బీజేపీ నేతలు తమ ప్రభుత్వం గురించి వ్యంగంగా మాట్లాడటం తప్ప వారు రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. కేసీఆర్?ను కొడుకు కేటీఆర్, అల్లుడు హరీష్ రావు అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారా? అని ఎద్దేవా చేశారు. ఒకవేళ అల్లుడు, కొడుక్కి అవకాశం ఇవ్వాలనుకుంటే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకోవాలని కేసీఆర్ కు సలహానిచ్చారు.

గత బీఆర్ఎస్ పాలనలో ధనిక రాష్ట్రమైన తెలంగాణ అప్పులపాలైందని వాపోయారు. ఆ ప్రభుత్వం రూ. ఎనిమిదిన్నర లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిందని, ఈ క్రమంలో తాము ఓ వైపు కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. విద్యా, వైద్య రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గతంలో కేసీఆర్ వైద్య రంగాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. స్కిల్ యూనివర్శిటీతో యువతలో నైపుణ్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లును తొక్కిపెట్టి ఆయా తరగతుల నోటికాడి కూడును లాక్కుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం మెడలు వంచైనా సరే... బీసీల గణనను కులగణనలో చేర్పిస్తామని చెప్పారు.

# అమెరికాలోనూ 'సర్'..

**-ఓటర్ల జాబితాల సమీక్షకు ట్రంప్ సర్కారు సిద్ధం**
**-10 లక్షల మంది భారత సంతతి ఓటర్లపై తొలగింపు ముప్పు?**
**-ఓటర్ల జాబితాల సమగ్ర పరిశీలనకు రూ.125 కోట్ల నిధులు**
**-జాతీయ ఓటర్ల డేటాబేస్ సిద్ధం చేసే ప్రక్రియ**
**-నవంబర్ మధ్యంతర ఎన్నికల్లోపు ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యం**
**-బాధ్యతను ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)కి అప్పగించిన ట్రంప్**
**-50 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల పరిశీలన, నవీకరణ**
**-ప్రభుత్వ రికార్డులతో ఓటర్ల సమాచారాన్ని సరిపోల్చనున్న కంప్యూటర్లు**
**--వివరాల్లో తేడాలుంటే పునఃపరిశీలన.. తొలగింపునకు అవకాశం**
**-10 లక్షల మంది భారత సంతతి పౌరులపై వేలాడుతున్న కత్తి**



వాషింగ్టన్

భారత్‌లోని 'సర్' (ప్రత్యేక సమగ్ర సమీక్ష) లాగా అమెరికాలో ఓటర్ జాబితాలను నిశితంగా పరిశీలించడాన్ని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించారు. ఇందుకోసం సుమారు రూ.125 కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా ఓటర్ జాబితాలను పరిశీలించి జాతీయ ఓటర్ డాటా బేస్ను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియలో అమెరికాలో నివసిస్తున్న 26 లక్షల మంది భారత సంతతి ఓటర్లలో 10 లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించే ముప్పు ఉందని అంచనా వేస్తున్నారు. నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికల్లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అమెరికా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొన్నది. ఈ ప్రక్రియ నిర్వహణను ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)కి ట్రంప్ అప్పగించారు. ఈ ప్రక్రియలో 50 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాను పరిశీలించి, అప్‌డేట్ చేస్తారు. ఓటర్ల సమాచారాన్ని వివిధ ప్రభుత్వ రికార్డులతో సరి చూస్తారు. ఓటర్ల జాబితాలను కంప్యూటర్లు ఇమ్మిగ్రేషన్, ఇతర రికార్డులతో సరి చూస్తాయి. ఒక పేరు లేదా సమాచారం రికార్డులతో సరిపోలకపోతే, ఆ ఓటర్ వివరాలను పునఃతనిఖీ చేస్తారు. అలాంటి వాళ్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రమాదముంది.

భారతీయులపైనే ఎక్కువ ప్రభావం ఎందుకు?

న్యూయార్క్, న్యూజెర్సీ, కాలిఫోర్నియా, టెక్సాస్ లాంటి రాష్ట్రాల్లో భారత సంతతి ఓటర్లు, వారి రాజకీయ ప్రభావం చెప్పుకోదగ్గ ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఓటర్ల వెరిఫికేషన్, నమోదు ప్రక్రియ నిబంధనలు ప్రతి రాష్ట్రానికీ వేర్వేరుగా ఉన్నాయి. అయితే తాజా ప్రక్రియలో రికార్డులను పరిశీలిస్తుండటంతో భారత సంతతి ఓటర్లు కూడా స్క్రూటినీ చేయబడతారు. భారత సంతతి ఓటర్ల ఓటింగ్ సరళిని కూడా తాజా ప్రక్రియలో పర్యవేక్షించవచ్చని తెలుస్తున్నది. అయితే ఎంత మంది పేర్లను వాస్తవంగా తొలగిస్తారనేది ప్రక్రియ పూర్తయిన తర్వాతే తెలుస్తుంది. మరోవైపు ఓటర్ గుర్తింపు కార్డును దేశవ్యాప్తంగా అమలు చేయాలని ట్రంప్ సర్కార్ భావిస్తున్నది. అమెరికన్ ఓటర్ అర్హత చట్టం ప్రతిపాదిత బిల్లు ద్వారా ఓటర్ల రిజిస్ట్రేషన్, ఓటింగ్ నిబంధనలను కఠినం చేయాలని యోచిస్తున్నది.

# మెట్రో రంగంలో భారత్ మరో మైలురాయి

మొదటి తరువాయి



న్యూఢిల్లీ

మెట్రో రైలు రంగంలో భారత్ మరో భారీ మైలురాయిని అందుకోబోతున్నది. రాబోయే రెండేళ్లలో అమెరికా ను వెనక్కి నెట్టి చైనా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారత్ అవతరించనుంది. ఈ విషయాన్ని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ తెలిపారు. ఒకప్పుడు కేవలం కొన్ని నగరాలకే పరిమితమైన మెట్రో సేవలు ఇప్పుడు దేశంలోని 26 నగరాలకు విస్తరించాయని మంత్రి చెప్పారు.రాబోయే రోజుల్లో కొత్త మార్గాలు పెద్ద ఎత్తున అందుబాటులోకి రానుండటంతో భారత్ మెట్రో నెట్‌వర్క్ మరింత వేగంగా పెరగనుందని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చిన సమయంలో దేశంలో కేవలం 5 నగరాల్లో 245 కిలోమీటర్ల మేర మాత్రమే మెట్రో రైలు మార్గాలు అందుబాటులో ఉండేవని మంత్రి గుర్తుచేశారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, దేశవ్యాప్తంగా 26 నగరాల్లో సుమారు 1,170 కిలోమీటర్ల మేర మెట్రో రైలు సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. గడిచిన 12 ఏళ్లలోనే దేశ మెట్రో నెట్‌వర్క్ దాదాపు ఐదు రెట్లు పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మెట్రో విస్తరణకు పెద్దపీట వేయడంతో కొత్త నగరాల్లోనూ మెట్రో రైలు ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో మూడో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్ కలిగిన దేశంగా ఉంది. చైనా అగ్రస్థానంలో ఉండగా.. అమెరికా రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులు పూర్తవుతూ, నిర్మాణంలో ఉన్న మార్గాలు అందుబాటులోకి వస్తే రెండేళ్లలో అమెరికాను భారత్ అధిగమించే అవకాశం ఉందని మనోహర్ లాల్ అన్నారు.రాబోయే రెండేళ్లలో అమెరికాను అధిగమించి చైనా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారత్ అవతరిస్తుందని తాను భావిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు.

# కొత్త ప్రపంచ పటంపై భారత్ అభ్యంతరం

**--జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌ను అధికారిక పటం ప్రకారమే చూపాలి**
**-ఐరాస ప్రతిపాదనపై విదేశాంగ శాఖ స్పష్టీకరణ**
**-సరిహద్దులు, వివాదాస్పద ప్రాంతాలపై నిర్ణయాలేవీ లేవు**
**-దేశాల వాస్తవ భూభాగ వైశాల్యాన్ని చూపడమే లక్ష్యం**
**-భారత భూభాగాన్ని తప్పుగా చూపించే అవకాశం ఉందని ఆందోళన**
**-సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతపై భారత్ స్పష్టమైన వైఖరి**
**-భూభాగ వైశాల్యం ఆధారంగా రూపొందించే పటానికి భారత్ మద్దతు**



న్యూఢిల్లీ

ఐక్య రాజ్య సమితి(ఐరాస) కొత్త ప్రపంచ పటంపై భారత్ తన వైఖరిని స్పష్టం చేసిది. ఐరాస ప్రతిపాదన ఏదైనా నిర్దిష్ట పటాన్ని గుర్తించినట్లు కాదని భారత విదేశాంగ శాఖ ఆదివారం తెలిపింది. ఆ ప్రతిపాదనలో దేశాల సరిహద్దులు, వివాదాస్పద ప్రాంతాలు లేదా వాటి పేర్లపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదంది. ప్రతి దేశ వైశాల్యం దాని వాస్తవ పరిమాణానికి అనుగుణంగా కనిపించేలా ప్రపంచ పటాన్ని ప్రదర్శించడమే ఐరాస ప్రతిపాదన ఉద్దేశం.ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్, లద్దాఖ్ సహా భారత భూభాగం మొత్తాన్ని భారత అధికారిక పటం ప్రకారం చూపించాలని ఐరాసను భారత్ కోరింది. తమ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతపై తమ వైఖరి స్పష్టమైనదని, అచంచలమైనదని విదేశాంగ శాఖ పేర్కొన్నది. వాస్తవానికి దేశాలను వాటి సాపేక్ష భూభాగ వైశాల్యం ప్రకారం చూపించే పటాల వినియోగ ప్రతిపాదనకు భారత్ అనుకూలంగా ఓటేసింది. అయితే అలాంటి పటాల్లో భారత భూభాగాన్ని తప్పుగా చూపించే అవకాశం ఉందని భారత్ ఆందోళన చెందుతున్నది.

# జల యుద్ధానికి సిద్ధం కండి

ప్రయత్నం చేయడం లేదనే విషయం ఎన్డీఎస్ఏ ప్రకటనతో స్పష్టమైందని కేసీఆర్ అన్నారు. మేడిగడ్డ వద్ద చిన్నపాటి మరమ్మతులు చేసి కాళేశ్వరాన్ని వినియోగంలోకి తెస్తే సుమారు 13 జిల్లాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని, అయినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. 90 శాతం పూర్తయిన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని సహించేది లేదన్నారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నీరు ఉన్నా తెలంగాణ పంటలకు విడుదల చేయకపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని చెప్పారు. గోదావరికావేరి నదుల అనుసంధానం పేరుతో రాష్ట్రానికి నష్టం కలిగించే నిర్ణయాలను వ్యతిరేకించాలని సూచించారు.

హామీలపై నిలదీయా

కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన హామీలను వెయ్యి రోజులు గడిచినా ఎందుకు అమలు చేయలేదని అసెంబ్లీలో ప్రశ్నించాలని కేసీఆర్ అన్నారు. 22ఏ నిషేధిత జాబితాలో పట్టా భూములను చేర్చడంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసర పరిస్థితుల్లో భూములు విక్రయించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని సూచించారు. మిషన్ భగీరథను నిర్వీర్యం చేసి తాగునీటి సమస్యను పెంచారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పాలిటెక్నిక్ విద్యను దెబ్బతీసేలా జీఓ 97 తీసుకువచ్చారని విమర్శిస్తూ దాన్ని సభలో ఎండగట్టాలని కోరారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, జాబ్ క్యాలెండర్, ఉద్యోగ నోటిఫికేషన్లపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని చెప్పారు.

ఫార్మాసిటీ, సింగరేణిపైనా పోరాటం

బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫార్మాసిటీని రద్దు చేసి, ఫ్యూచర్ సిటీ పేరుతో పేదల భూములను రియల్ ఎస్టేట్ దందాకు ఉపయోగిస్తున్నారని కేసీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల విక్రయాలు, సింగరేణిలో అవినీతి, మెట్రో రైలు నిర్వహణను ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవడం వంటి అంశాలపై సభలో నిలదీయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, గురుకులాల్లో విద్యార్థుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. విద్యా వ్యవస్థ క్షీణత, మహిళలపై నేరాలు, శాంతిభద్రతల వైఫల్యం, అవినీతి, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉభయ సభల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

# ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

మొదటి తరువాయి

కుటుంబ సభ్యులు, డిపెండెంట్ల ఆరోగ్య భద్రత కోసం తీసుకొచ్చిన నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగులు ఎదురుచూ స్తున్న సమస్యను మానవీయ కోణంలో పరిష్కరిం చాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వంలో పనిచే స్తున్న ఉద్యోగులంతా తమవారేననీ, వారు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్లు గానీ అనారోగ్యానికి గురైనప్పుడు ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురికాకూడదన్న ఉన్నతమైన ఆశయంతోనే అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం రూపకల్పన, విధివిధానాల విషయంలో ఉద్యోగ సంఘాలతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి, వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని వివరించారు. ఉద్యోగుల గురించి మానవీయ కోణంలో ప్రజాప్రభుత్వం తెచ్చిన పథకాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు.


# వర్షం కోసం


# రైతన్న ఎదురుచూపులు..

- వర్షాభావంతో పంటలపై పెరుగుతున్న ఆందోళన
- నకిలీ క్రిమిసంహారకాలతో రైతులకు తీవ్ర నష్టం
- పెట్టుబడి పెడుతున్నా ఫలితం దక్కని పరిస్థితి
- ఆకాశం వైపు ఆశగా చూస్తున్న అన్నదాత
- నాణ్యమైన వ్యవసాయ మందులు అందించాలని విజ్ఞప్తి: రైతు కందాడి మణిపాల్ రెడ్డి









**ఆలేరు, సెప్టెంబర్06(నేటి దర్శిని):**
రైతన్న పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. ఒకవైపు వర్షాలు సకాలంలో కురవక పంటల సాగుపై తీవ్ర ఆందోళన నెలకొనగా.. మరోవైపు పంటలను చీడపీడల నుంచి కాపాడుకునేందుకు కొనుగోలు చేస్తున్న క్రిమిసంహారక మందులు నకిలీవిగా తేలుతుండటం రైతులను మరింత ఆవేదనకు గురిచేస్తోంది. ఆకాశం వైపు ఆశగా చూస్తూ వర్షం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతకు నకిలీ వ్యవసాయ మందుల సమస్య మరో భారంగా మారింది. వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే పంటలు పండుతాయని ఆశతో రైతులు పొలాల్లో విత్తనాలు వేశారు. అయితే అనుకున్న స్థాయిలో వర్షాలు లేకపోవడంతో పంటలు ఎదుగుదల మందగించే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులతో పెట్టుబడి భారమవుతుండగా.. పంటను రక్షించుకునేందుకు కొనుగోలు చేస్తున్న క్రిమిసంహారక మందులు కూడా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై రైతు కందాడి మణిపాల్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల కోసం ఎన్నాళ్లని ఆకాశం వైపు చూడాలని ఆయన ప్రశ్నించారు. వర్షాలు సకాలంలో పడక పంటలు దెబ్బతినే పరిస్థితి ఒకవైపు ఉంటే.. పంటకు అవసరమైన క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసినా అవి నకిలీవిగా ఉండటం రైతుల కష్టాలను మరింత పెంచుతోందని పేర్కొన్నారు. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు అప్పులు చేసి మరీ వ్యవసాయ ఇన్‌పుట్స్ కొనుగోలు చేస్తున్నారని, అయితే నకిలీ మందుల కారణంగా పెట్టిన పెట్టుబడి వృథా అయ్యే ప్రమాదం ఉందని మణిపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ మందుల విక్రయాలపై సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు కఠినంగా నిఘా పెట్టాలని ఆయన కోరారు. వ్యవసాయానికి అవసరమైన క్రిమిసంహారక మందుల నాణ్యతను అధికారులు తరచూ తనిఖీ చేయాలని రైతులు కోరుతున్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే మందులు కొనుగోలు చేసేలా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, నకిలీ ఉత్పత్తులు మార్కెట్‌లోకి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని, నకిలీ వ్యవసాయ మందుల బెడద నుంచి రైతులకు రక్షణ కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పోరాడుతున్న రైతులకు నకిలీ వ్యవసాయ ఉత్పత్తుల రూపంలో మరో సమస్య ఎదురుకాకుండా ప్రభుత్వం, అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రైతు మణిపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## రేవంత్ పాలనకు చరమగీతం తప్పదు..

- ప్రజల పక్షాన పోరాటం ఆగదు...
- రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- ప్రతి సంక్షేమ పథకాన్ని తిరిగి అమలు చేస్తాం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి





**పటాన్ చెరు సెప్టెంబర్ 6(నేటి దర్శిని)**
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా ఆదివారం బిహెచ్‌ఈఎల్ చౌరస్తా నుంచి ఇస్నాపూర్ వరకు భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలో మహిళలతో కలిసి భారీ నిరసన చేపట్టారు.
ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణను సాధించిన అనంతరం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, సంక్షేమం--అభివృద్ధిని రెండు కళ్లుగా పాలన సాగించామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలకు బ్రేక్ పడిందని, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.
ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ప్రజల మధ్యకు వచ్చి పోరాటం చేస్తోందని తెలిపారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని, రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. "రాబోయేది మన ప్రభుత్వమే.. ప్రతి సంక్షేమ పథకాన్ని తిరిగి అమలుపరుస్తాం. ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యం. రేవంత్‌రెడ్డి రాక్షస పాలనకు త్వరలోనే చరమగీతం పాడటం ఖాయం" అని గూడెం మహిపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పోరాటం ప్రజల సమస్యల పరిష్కారం వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, గూడెం మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, ఆటో కార్మికులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెయ్యి రోజులు దాటినా.. హామీలకు దిక్కేది?

- గంజి కృష్ణ ఆధ్వర్యంలో మిడ్జిల్‌లో బీఆర్ఎస్ 'బాకీ కార్డు' నిరసన





**మిడ్జిల్, సెప్టెంబర్ 6, (నేటి దర్శిని )**
100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెయ్యి రోజులు దాటుతున్నా హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం మిడ్జిల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు గంజి కృష్ణ ఆధ్వర్యంలో 'బాకీ కార్డు' ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నాయకులు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, మహిళలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. హామీల అమలులో జాప్యంతో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

# నిదానపల్లిలో అంబరాన్నంటిన బోనాల సంబురాలు





**రామన్నపేట, సెప్టెంబర్06 (నేటి దర్శిని ప్రతినిధి):** డప్పుల మోత.. యువత నృత్యాలు.. మహిళల బోనాల ఊరేగింపుతో నిదానపల్లి పల్లె పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ముత్యాలమ్మ తల్లికి గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత గ్రామపంచాయతీ నుంచి సర్కారు బోనాన్ని కోట మైసమ్మ తల్లికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో తరలిరాగా.. యువకులు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. డప్పుల మోతల మధ్య సాగిన ఊరేగింపు ఆకట్టుకుంది. చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని.. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ముగింపు వేడుకలకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో నిదానపల్లి సందడిగా మారింది.

# గుజరాత్‌లో తెలంగాణ మీడియా బృందం పర్యటన

**● కేంద్ర పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రత్యక్ష అధ్యయనం**




**అహ్మదాబాద్ సెప్టెంబర్06 (నేటి దర్శిని):** పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణకు చెందిన 10 మంది పాత్రికేయుల బృందం గుజరాత్ రాష్ట్రంలో వారం రోజుల పర్యటనను ప్రారంభించింది. సెప్టెంబర్ 6 నుంచి 12 వరకు కొనసాగనున్న ఈ పర్యటనకు మీడియా కమ్యూనికేషన్ అధికారి (ఎంఅండ్‌సీవో) శ్రీమతి వర్గంటి గాయత్రి నాయకత్వం వహిస్తున్నారు. ఆదివారం అహ్మదాబాద్ చేరుకున్న మీడియా బృందానికి పీఐబీ అధికారులు స్వాగతం పలికారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. ఆయా కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు మరింత విస్తృతంగా చేరవేయడంతో పాటు, వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల అనుభవాలను పరస్పరం పంచుకునే అవకాశం ఈ పర్యటన ద్వారా లభించనుంది. పర్యటనలో భాగంగా గుజరాత్‌లోని పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులు, సంస్థలను మీడియా బృందం ప్రత్యక్షంగా సందర్శించనుంది. సబర్మతీ రివర్‌ఫ్రంట్, ధోలేరా ప్రత్యేక పెట్టుబడుల ప్రాంతం (ధోలేరా ఎస్ఐఆర్), గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్–సిటీ (గిఫ్ట్ సిటీ), అమూల్ డెయిరీ, ఐక్యతా మూర్తి, సర్దార్ సరోవర్ ఆనకట్ట తదితర ప్రాంతాలను పరిశీలించనుంది. అలాగే సీఈపీటీ విశ్వవిద్యాలయం, జాతీయ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యాలయం, సబర్మతీ మల్టీ మోడల్ హబ్‌లను కూడా బృందం సందర్శించనుంది. ఆయా ప్రాజెక్టులు, సంస్థల ప్రతినిధులు, అధికారులు, ఇతర భాగస్వాములతో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరు, సాధించిన ఫలితాలను పాత్రికేయులు తెలుసుకోనున్నారు. గుజరాత్‌లోని మౌలిక వసతులు, పారిశ్రామిక అభివృద్ధి, విద్య, ఆర్థిక సేవలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం తదితర రంగాల్లోని అభివృద్ధి నమూనాలను పరిశీలించడం ద్వారా తెలంగాణ మీడియా ప్రతినిధులకు సమగ్ర అవగాహన ఏర్పడనుంది.

# నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**ఆమనగల్, సెప్టెంబర్ 06(నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల పరిధిలోని దయ్యాల బోర్డు తాండాలో ఆదివారం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టాస్క్ సి ఓ ఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరయ్యారు.యువజన కాంగ్రెస్ నాయకులు నేనావత్ నవీన్ నాయక్ నూతన గృహాన్ని సందర్శించి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని నవీన్ నాయక్ మరియు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు కొండల్ యాదవ్,రఘు, మహేష్ నాయక్,శ్రీపతి రాజు,సాయి తదితరులు పాల్గొన్నారు.





# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో పల్లెలు ధ్వంసం

**● పారిశుద్ధ్యం పడకేసింది: మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్**




**నిడమానూరు, సెప్టెంబర్ 6 (నేటి దర్శిని):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, పల్లెల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు నోముల భగత్ కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిడమానూరు మండల కేంద్రంలో రోడ్లు ఊడ్చి నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే భగత్ కుమార్ స్వయంగా పొరకబట్టి రోడ్లు ఊడ్చి పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా భగత్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించడానికే పరిమితమైందని విమర్శించారు. వెయ్యి రోజుల పాలనలో రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రగతికి ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో పల్లెల్లో పారిశుద్ధ్య పరిస్థితులు దారుణంగా మారాయని, గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని అన్నారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలనే భావనతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమాల ద్వారా గ్రామాల అభివృద్ధికి కృషి చేసిందని ఆయన పేర్కొన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి, పల్లె ప్రగతిని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. గ్రామపంచాయతీల్లో కనీస మౌలిక వసతులు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొందని, వీధి దీపాలు ఏర్పాటు చేసుకునే పరిస్థితి కూడా లేదని భగత్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ నాయకుల తీరు దోచుకోవడం, దాచుకోవడంగా మారిందని ఆరోపించారు. వెయ్యి రోజులైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు మారలేదని, ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఏ విధంగా మాట్లాడేవారో ఇప్పటికీ అదే విధంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు.
రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్న భగత్ కుమార్, వచ్చే రెండేళ్లలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు తాటి సత్యపాల్, నల్లబోతు వెంకటేశ్వర్లు, బైరెడ్డి సత్యనారాయణరెడ్డి, బొల్లం సైదులు, మురళి, మాచర్ల దాస్, ఉన్నం ఈశ్వర్, జమాల్పూర్ నర్సింగ్, లకుమల్ల మధు, కేశ శంకర్, పాల్వాయి వెంకటేశం, క్రాంతి, నూనె ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కుంట్లూర్ శ్రీశ్రీశ్రీ బీరప్పస్వామికమరాతిదేవి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం

**● కుంట్లూర్ గ్రామ కురుమసంఘం పెద్దల సమక్షంలో ప్రత్యేక పూజలు**





**అబ్దుల్లాపూర్ మెట్, సెప్టెంబర్ 06(నేటి దర్శిని):** కుంట్లూర్ గ్రామ శ్రీశ్రీశ్రీ బీరప్పస్వామి శ్రీశ్రీశ్రీ కమరాతిదేవి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, ఎంఎంసీ నాగోల్ సర్కిల్ కుంట్లూర్ గ్రామ కురుమసంఘం పెద్దల సమక్షంలో దేవాలయంలో నూతన లింగాల (దేవుడి విగ్రహాల) ప్రతిష్టాపన మహోత్సవం అనంతరం గ్రామ కురుమ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంట్లూర్ గ్రామ కురుమ సంఘం పెద్దకురుమ దడిగ కొమురయ్య కురుమ, శేలోజీ కంకల సత్తయ్యకురుమ, అధ్యక్షులుగా నీళ్ల జంగయ్య కురుమ, ప్రధాన కార్యదర్శిగా పల్లె మల్లేశం కురుమ, కోశాధికారిగా కోడూరి అశోక్ కురుమ, ఉపాధ్యక్షులుగా రావుల నరసింహ కురుమ, అచ్చిన శీను కురుమ తదితర కురుమ పెద్దలు, కురుమ కులస్తులు స్వామివారి, అమ్మవారి విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవాలకు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా కురుమ కుల పెద్దలు మాట్లాడుతూ.. కురుమ కులస్తులు ఐక్యంగా ముందుకు సాగడంతో పాటు సమిష్టి కృషితో చేసే కురుమ సంఘం అభివృద్ధికి బీజం పడుతుందని వారు పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీన ఆదివారం రోజున కుంట్లూరు గ్రామంలోని కురుమ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ బీరప్పస్వామి కమరాతిదేవి దేవాలయంలో బోనాల పండుగను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ పండుగలో ప్రతి కురుమ కులస్తుడు ఇంటి నుంచి ఒక్కో బోనం తీయాలని కురుమ పెద్దలు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుత్తి రమేష్ కురుమ, బండ శంకరయ్య కురుమ, కార్యదర్శులు నర్రి శ్రీశైలం కురుమ, కొత్తకుర్మ మల్లేష్ కురుమ, కొండే ప్రదీప్ కురుమ, బర్ల లింగస్వామి కురుమ, సహాయ కార్యదర్శులు పాలంచి రాజు కురుమ, మీస బాలరాజు కురుమ, మంగ కృష్ణ కురుమ, మంగ నరసింహ కురుమ, గౌరవ సలహాదారుగా కప్పే రమేష్ కురుమ, అదే మల్లేష్ కురుమ, జమ్ము వీరభద్రం కురుమ, కమిటీ సభ్యులు జమ్ము యాదయ్య కురుమ, అరిగే లింగస్వామి కురుమ, ఒగ్గు అయోధ్య కురుమ, కుండే బిక్షపతి కురుమ, నర్రి శ్రీశైలం కురుమ, కురుమ సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వాడియాలలో ఘనంగా కాటమయ్య స్వామి బోనాల ఉత్సవాలు





**మిడ్జిల్, సెప్టెంబర్ 6, (నేటి దర్శిని):** మిడ్జిల్ మండలంలోని వాడియాల గ్రామంలో గౌడ సంఘం అధ్యక్షులు సాయిలు గౌడ్ ఆధ్వర్యంలో కులదేవుడు శ్రీ కాటమయ్య స్వామి ఆలయ ఆవరణలో బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గౌడ సంఘం సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాటమయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను నెత్తిన పెట్టుకుని ఆలయానికి చేరుకుని స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని స్వామివారిని వేడుకున్నారు. గౌడ కుల సంప్రదాయాలు, ఆచారాలను కొనసాగిస్తూ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఈ బోనాల ఉత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి. యువతతో పాటు మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ టి. చంద్రయ్య గౌడ్ మాట్లాడుతూ.. కాటమయ్య స్వామి తమ కులదైవమని, తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కొనసాగించడం తమ బాధ్యత అని తెలిపారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో ఉత్సవాలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 420 హామీలపై ఆటో కార్మికుల సమర శంఖం..!

# బండి సంజయ్ కుటుంబ వేడుకకు హాజరైన బీజేపీ నేతలు





**మిడ్జిల్,సెప్టెంబర్ 6, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):**
హైదరాబాద్ శంషాబాద్‌లోని GMR ఫంక్షన్ హాల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారి అన్న కూతురి వివాహ రిసెప్షన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి, నారాయణపేట జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు మంతంగోడ్ వెంకట్రాములు, అమరచింత నారాల నారాయణ హాజరయ్యారు.
ఈ సందర్భంగా నూతన వధూవరులను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన దంపతులను ఆశీర్వదిస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అభివృద్ధి మరియు ఆనందాలతో నిండాలని ఆకాంక్షించారు. కేంద్ర మంత్రి కుటుంబ వివాహ వేడుకకు బీజేపీ నాయకులు హాజరు కావడంతో కార్యక్రమం సందడిగా సాగింది. పలువురు ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఈ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లా 320A ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**● డిస్ట్రిక్ట్ గవర్నర్ సురేష్ జగ్నాని చేతుల మీదుగా అవార్డుల ప్రదానం**




**ఆమనగల్లు, సెప్టెంబర్ 06(నేటి దర్శిని):**
లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320A జిల్లా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి నియోజకవర్గం నుంచి విద్యారంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు ఉపాధ్యాయులను సికింద్రాబాద్‌లోని శోభ కన్వెన్షన్ హాల్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కడ్తాల్ ప్రగతి స్కూల్ ప్రిన్సిపాల్ సువర్ణ గోవర్ధన్ రెడ్డి,డిండి చింతపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రిన్సిపాల్ లలిత, అక్షర స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్ రెడ్డి, తలకొండపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు లత, వెల్దండ మండలానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీనాథ్, ఆమనగల్ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలు కరుణలను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి సన్మానించారు.
లయన్స్ 320ఏ జిల్లా గవర్నర్ లయన్ సురేష్ జగ్నాని , వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ శశికాంత్ , మాజీ గవర్నర్ కోటేశ్వర్ రావు , రీజినల్ చైర్మన్ లయన్ ప్రశాంత్ రెడ్డి, జోన్ చైర్మన్ లయన్ రాంరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అందిస్తూ ఉత్తమ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షులు లయన్ గోవర్ధన్ రెడ్డి, లయన్ శ్రీనివాస్ రెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ జూలూరి రమేష్,లయన్ డా. దివ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారని పిఆర్ఓ ఎంఏ పాషా తెలియజేశారు.

# పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం

**●ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు,సెప్టెంబర్ 06(నేటి దర్శిని);**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తుందని,పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని తన నివాసంలో ఆయన నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్య బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం వర్తించని అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ తమ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచడంతోపాటు ముఖ్యమంత్రి సహాయనిధి కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడిగడ్డ ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్,సురేందర్ రెడ్డి, శివ,వినోద్,జంగయ్య, మల్లయ్య అనారోగ్య బాధితులతో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**●వేలాది ఆటోలతో భారీ నిరసన ర్యాలీ..**
**●బీహెచ్ఈఎల్ నుంచి ఇస్నాపూర్ వరకు హోరెత్తిన నినాదాలు**
**●ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం**
**●హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్**
**●గూడెం మహిపాల్‌రెడ్డి నాయకత్వంలో కదం తొక్కిన పటాన్‌చెరు ఆటో కార్మికులు**



**పటాన్ చెరు సెప్టెంబర్ 6 (నేటి దర్శిని):**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఆటో కార్మికులను మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గ ఆటో కార్మికులు ఆదివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి వేలాది మంది ఆటో కార్మికులు, భారీ సంఖ్యలో ఆటోలు తరలివచ్చాయి. బీహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ అశోక్‌నగర్, బీరంగూడ, రామచంద్రాపురం, పటాన్‌చెరు, ముత్తంగి మీదుగా ఇస్నాపూర్ వరకు సాగింది. భారీ సంఖ్యలో ఆటోలు రహదారులపై కదలడంతో ప్రధాన మార్గాలు నిరసన నినాదాలతో మార్మోగాయి. ఆటో కార్మికులు తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**రూ.12 వేల హామీ ఎక్కడ?**
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆటో




కార్మికులకు ఇచ్చిన ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం హామీని తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలును విస్మరించిందని ఆయన విమర్శించారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. అవసరమైతే భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఆటో యూనియన్ ప్రతినిధులు, వేలాది మంది ఆటో కార్మికులు పాల్గొన్నారు.







# ప్రైవేట్ టీచర్లకు అవార్డులు.. హక్కులు, భద్రత ఎక్కడ?

**●ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు.. గౌరవం కాదు.. 100 రెట్ల బాధ్యత!**
**●అవార్డుతో బాధ్యత మరింత పెరగాలి**
**● ట్రస్మా అధ్యక్షులు శివరాత్రి యాదగిరి ప్రైవేట్ టీచర్లే విద్యారంగానికి వెన్నెముక.. వారి సేవలను ప్రభుత్వం గుర్తించాలి**
**●రవీంద్రభారతిలో ఘనంగా ప్రైవేట్ ఉపాధ్యాయుల సన్మాన సభ**

**హైదరాబాద్, సెప్టెంబర్06 (నేటి దర్శిని):**
ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం కేవలం గౌరవం మాత్రమే కాదని.. ఆ అవార్డు అనంతరం సమాజం ఉపాధ్యాయులపై ఉంచే ఆశలు, బాధ్యతలు 100 రెట్లు పెరుగుతాయని ట్రస్మా అధ్యక్షులు శివరాత్రి యాదగిరి అన్నారు. అవార్డులు ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపు మాత్రమే కాకుండా.. విద్యార్థుల భవిష్యత్తును మరింత బాధ్యతతో తీర్చిదిద్దేందుకు ప్రేరణగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్, ప్రైవేట్ ఉద్యోగ సంఘం, రజనీ వాయిస్ తెలుగు దినపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రైవేట్ ఉపాధ్యాయుల సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న పలువురు ప్రైవేట్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

**అవార్డు వచ్చిందంటే బాధ్యత రెట్టింపు కావాలి**
ఈ సందర్భంగా శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం కాదని, భవిష్యత్ తరాలను నిర్మించే మహత్తర బాధ్యత అని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న వారు ఇకపై మరింత ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు.

**ప్రైవేట్ టీచర్ల సేవలను ప్రభుత్వం గుర్తించాలి**
ప్రైవేట్ ఉద్యోగ సంఘం అధ్యక్షులు గంధం రాములు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థలు కూడా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అయితే ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తగిన స్థాయిలో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, వేతనాలు, పని ఒత్తిడి, సామాజిక భద్రత వంటి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయులకు రక్షణ, సంక్షేమ చర్యలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**విలువలతో కూడిన విద్యే లక్ష్యం**
మోడల్ స్కూల్స్ మాజీ ఆర్జేడీ సరోజినీ దేవి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి సమాజంలో అత్యంత గౌరవప్రదమైనదని అన్నారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని సూచించారు. ప్రవచనకారులు యోగేష్ ప్రభు మాట్లాడుతూ.. పుస్తక జ్ఞానంతో పాటు విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విలువలతో కూడిన విద్య ద్వారానే మంచి సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. జాతీయ తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షులు రాంప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థుల్లో మాతృభాషపై అభిమానం, తెలుగు సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బడేసాబ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, గౌరవం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అజయ్ కార్తీక్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రైవేట్ ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అన్ని సంఘాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

**ఘనంగా ఉపాధ్యాయుల సన్మానం**
కార్యక్రమంలో పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రైవేట్ ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపునివ్వడంతో పాటు, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వేదికగా నిలిచింది. కార్యక్రమంలో ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నోముల మల్లేష్, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ, ప్రముఖ విద్యావేత్త ప్రణీత్ ఆచార్య వెంకటరామయ్య, రవీంద్రభారతి స్కూల్ వీరయ్య, అబ్దుల్ సమద్, అబ్దుల్ సాహిత్, మూర్తి, శ్రీదేవి, మాధవి, వెంకటేష్, కిరణ్, రామారావు తదితరులతో పాటు వివిధ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నాగోల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల దందా..!

●అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా
●టౌన్‌ప్లానింగ్ అధికారుల కనుసైగలోనే అక్రమాల జోరు.?





**నాగోల్, సెప్టెంబర్06 (నేటి దర్శిని):** నాగోల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకూ ముదురుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ నుంచి తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనుమతులు ఒక విధంగా తీసుకుని, క్షేత్రస్థాయిలో మరో విధంగా నిర్మాణాలు చేపడుతున్నా నాగోల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి**

అనుమతులకు మించి అదనపు అంతస్తులు, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలు వెలుస్తుండటంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి లక్షల రూపాయల్లో గండి పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. బిల్డింగ్ పర్మిషన్, డెవలప్‌మెంట్ ఛార్జీలు, ఇతర రుసుముల రూపంలో రావాల్సిన ఆదాయం అక్రమ నిర్మాణాల కారణంగా కోల్పోతున్న పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

**కోర్టులో కేసులు ఉన్నా.. నిర్మాణాలు మాత్రం జోరుగా**

కొన్ని నిర్మాణాలకు సంబంధించి కోర్టుల్లో రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. న్యాయస్థానాల పరిధిలో ఉన్న అంశాల్లో కూడా నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారులు ఎందుకు అడ్డుకోలేకపోతున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. హైకోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిన అధికారులు మౌనం వహిస్తే అక్రమ నిర్మాణదారులకు మరింత ధైర్యం వస్తుందనే విమర్శలు ఉన్నాయి.

నాగోల్ సర్కిల్ పరిధిలోని ప్లాట్ నెంబర్:178, ఇంటి నెంబర్:3-12-89 వద్ద నిర్మాణంపై కూడా అనుమతులు మించి అక్రమ అంతస్తులు ఉన్నాయని అధికారులపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, మంజూరైన ప్లాన్‌కు అనుగుణంగానే నిర్మాణం జరుగుతోందా లేదా అనే విషయాన్ని బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**రెండు అనుమతులు.. ఒకే భవనం.. నాలుగు అంతస్తులు**

సెంట్రల్ బ్యాంక్ కాలనీలో మరింత ఆసక్తికరమైన వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పక్కింటి నెంబర్ 3--9--82 రెండు వేర్వేరు అనుమతులు తీసుకుని ఒకే భవనంగా నాలుగు అంతస్తుల నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు ఉన్నాయి. రెండు అనుమతుల ఆధారంగా ఒకే భవనాన్ని ఏ విధంగా నిర్మించారు.? మంజూరైన ప్లాన్‌లో ఎన్ని అంతస్తులకు అనుమతి ఉంది.? వాస్తవంగా ఎన్ని అంతస్తులు నిర్మించారు.? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**అక్రమ నిర్మాణాలు చేసుకోండి మేము మౌనంగా ఉంటాం**

నాగోల్ సర్కిల్ పరిధిలో
అక్రమ నిర్మాణాలు ప్రారంభ దశలోనే గుర్తించి నిలిపివేయాల్సిన టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు నిర్మాణాలు పూర్తయ్యే వరకు వేచి చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణం పూర్తయిన తర్వాత నోటీసులు ఇచ్చినా, కూల్చివేత చర్యలు తీసుకోకపోతే వాటి ప్రయోజనం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అధికారులపై ఏసీబీ అధికారులచే విచారణ జరపాలని నాగోల్ సర్కిల్ పరిధిలో అనుమతులు, మంజూరైన ప్లాన్లు, వాస్తవ నిర్మాణాలను సమగ్రంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా కోర్టు కేసులు, హైకోర్టు ఆదేశాలు ఉన్న నిర్మాణాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

**జోనల్ కమిషనర్ దృష్టి సారించాలి**

నాగోల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు. తప్పు చేసిన అధికారులు ఎవరైనా ఉంటే శాఖాపరమైన చర్యలతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అనుమతులు కాగితాలకే పరిమితం చేసి.. క్షేత్రస్థాయిలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు సాగితే నగర ప్రణాళిక వ్యవస్థకే అర్థం లేకుండా పోతుంది. నాగోల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా కొరడా ఝుళిపిస్తారా.? లేక అక్రమ నిర్మాణాలకు మరింత అవకాశం ఇస్తారా.? అనేది వేచి చూడాలి.

# అసమానతలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం: బొజ్జ చిన్న మాదిగ

●చలో వరంగల్ ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలి



**నిడమానూరు, సెప్టెంబర్ 6 (నేటి దర్శిని):** అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని ఎమ్మార్పీఎస్ నిడమానూరు మండల ఇన్‌చార్జి బొజ్జ చిన్న మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల 9, 10 తేదీల్లో వరంగల్--మేడారం ప్రాంతంలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

నిడమానూరు మండలం ముప్పారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు, జిల్లా పెద్దులు మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన గ్రామ కమిటీ సమావేశానికి బొజ్జ చిన్న మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక అసమానతలపై భవిష్యత్‌లో ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఉద్యమాలకు సిద్ధం చేయాలని కార్యకర్తలకు సూచించారు.

అనంతరం ముప్పారం గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా ముడి పరశురాం మాదిగ, అధికార ప్రతినిధిగా ఆలంపల్లి శ్రీను మాదిగ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఆలంపల్లి శంకర్, కృష్ణ, చెరుకుపల్లి శ్రీను, ఇరిగి వాసు, శేఖర్, జిల్లా మధు, వెంకన్న బాబు మాదిగ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన జైత్రయాత్రలో పాల్గొనకుండా అక్రమ అరెస్టులు!

-దాడులు, అరెస్టులు, కేసులు ఇదే కాంగ్రెస్ ప్రజాపాలన..!
-బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 06 (నేటి దర్శిని):** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ విమోచన జైత్రయాత్రలో పాల్గొనకుండా నాయకులు కార్యకర్తలను అక్రమ అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో బీజేపీ చేపడుతున్న కార్యక్రమాలను అడ్డుకునేందుకు అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేయడం సరికాదన్నారు. అరెస్టులు చేసి, బెదిరించి బీజేపీ పోరాటాలను ఆపలేరని హెచ్చరించారు. తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గకుండా ప్రజల పక్షాన బీజేపీ పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.

# కాలుష్యరహిత పటాన్‌చెరు కోసం పరుగులు

●పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో '3ఖ రన్--రన్ ఫర్ నేచర్'
●భారీగా పాల్గొన్న యువత, మహిళలు, విద్యార్థులు
●అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణే లక్ష్యం: పృథ్వీరాజ్







**పటాన్‌చెరు సెప్టెంబర్ 6 (నేటి దర్శిని)** పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఎం.డి.ఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ 'పొల్యూషన్ ఫ్రీ పటాన్‌చెరు సీజన్-2--3ఖ రన్, రన్ ఫర్ నేచర్' కార్యక్రమం లో పాల్గొన్నారు. సర్వీస్ రోడ్ సమీపంలో నిర్వహించిన రన్‌ను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి యువత, మహిళలు, విద్యార్థులు, చిన్నారులు, సీనియర్ సిటిజన్లు, ఉద్యోగులు, పరిశ్రమల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్లకార్డులు, నినాదాలతో సాగిన రన్‌లో 'పచ్చదనం పెంచుదాం.. కాలుష్యాన్ని తగ్గిద్దాం', 'ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం' వంటి సందేశాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. రన్‌లో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలతో పాటు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరులో ఆర్థిక అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కాలుష్య నియంత్రణ కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

"కాలుష్యరహిత పటాన్‌చెరు ఒక్కరి లక్ష్యం కాదు.. మనందరి సమిష్టి సంకల్పం. ఇది ముగింపు కాదు.. పర్యావరణ ఉద్యమానికి మరో అడుగు" అని ఆయన అన్నారు. పచ్చదనం, పరిశుభ్రత, ప్లాస్టిక్ నియంత్రణపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. "మన పటాన్‌చెరు.. మన బాధ్యత.. మన భవిష్యత్. రాబోయే తరాలకు స్వచ్ఛమైన, పచ్చని, ఆరోగ్యకరమైన పటాన్‌చెరును అందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మెడికల్ పార్ట్‌నర్‌గా సహకరించిన అమెదా హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బందికి పృథ్వీరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు శాఖ, పరిశ్రమల ప్రతినిధులు, వాలంటీర్లు, నిర్వాహక బృందం, పటాన్‌చెరు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ నూతన కార్యాలయం ప్రారంభం



**ఇబ్రహీంపట్నం: ( సెప్టెంబర్ 06) (నేటి దర్శిని):** రానున్న రోజుల్లో విద్యార్థి నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విద్యార్థి విభాగం కీలకపాత్ర పోషించాలని ఆయన అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థి విభాగం నాయకులు మంచిరెడ్డి కిషన్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు విద్యార్థి నాయకులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మరోసారి విజయం సాధిస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. కార్యాలయ ప్రారంభోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్, మున్సిపాలిటీ అధ్యక్షులు మడుపు శివ సాయి, మండల అధ్యక్షులు అంబోత్ ప్రవీణ్ నాయక్, నియోజకవర్గ నాయకులు సర్పంచ్ రాఘవేంద్ర గౌడ్, పి. శివకుమార్, కొత్త గణేష్ గౌడ్, పి. తిరుమల్ రెడ్డి, దొండ మనీష్ రెడ్డి, దొండ శివ రెడ్డి, సోయల్, భానతదితరులు పాల్గొన్నారు.



# రెండు రోజుల్లోనే రూ. 50 కోట్లు..


### -బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న 'మీర్జాపూర్ ది మూవీ'




ప్రముఖ వెబ్ సిరీస్ ఆధారంగా తెరకెక్కిన 'మీర్జాపూర్ ది మూవీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. తొలి రోజు మంచి ఓపెనింగ్స్ రాబట్టిన ఈ చిత్రం, రెండో రోజు కూడా అదే హవాను కొనసాగించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సినిమా రెండో రోజు దేశీయ మార్కెట్లో రూ. 31 కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. దీంతో రెండు రోజుల్లో భారత్‌లో దీని మొత్తం నెట్ కలెక్షన్లు రూ. 56.75 కోట్లకు చేరాయి. కాగా.. కేవలం రెండు రోజుల్లోనే ఈ చిత్రం రూ. 50 కోట్ల మైలురాయిని దాటడం విశేషం. దీని ద్వారా దేశీయ గ్రాస్ వసూళ్లు రూ. 68.20 కోట్లకు చేరుకున్నాయి.ఓవర్సీస్ మార్కెట్‌లోనూ ఈ చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. రెండో రోజు విదేశాల్లో రూ. 6 కోట్లు రాబట్టడంతో, ఓవర్సీస్ గ్రాస్ మొత్తం రూ. 10.25 కోట్లకు చేరింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా తొలి రెండు రోజుల్లోనే రూ. 78.45 కోట్ల గ్రాస్ కలెక్షన్లను సాధించి, రూ. 80 కోట్ల మార్కుకు చేరువయింది. గుర్మీత్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ప్రేక్షకులు మరియు విమర్శకుల నుండి పాజిటివ్ రివ్యూలు వస్తుండటంతో థియేటర్లలోకి జనం భారీగా తరలివస్తున్నారు. ప్రస్తుతం బాక్సాఫీస్ 'టాక్సిక్', 'హనుమాన్ అంశ్' సినిమాలతో పాటు అర్షద్ వార్సి 'జీవన్ భీమా యోజన' చిత్రాలతో మీర్జాపూర్ పోటీపడుతోంది.

# ఎన్టీఆర్ సినిమాలో అదిరిపోయే స్పెషల్ సాంగ్..

### - భారీ సెట్‌లో ఇద్దరు హీరోయిన్లతో మాస్ ట్రీట్!



యంగ్ టైగర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 'డ్రాగన్' లేదా 'బ్రూస్ లీ' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమా ఇప్పటికే భారీ హైప్‌ను సొంతం చేసుకుంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి సినిమాలతో తనదైన యాక్షన్ బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్‌ను ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ క్రేజీ అప్‌డేట్ ఇండస్ట్రీ వర్గాల్లో వైరల్ అవుతోంది. సినిమా కోసం ఓ భారీ స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ పాట కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలతో పాటు భారీ విజువల్స్‌కు కూడా ప్రత్యేక స్థానం ఉంటుంది. అదే తరహాలో ఎన్టీఆర్ సినిమాకు కూడా ఆయన స్పెషల్ సాంగ్‌ను భారీ స్థాయిలో డిజైన్ చేస్తున్నట్లు టాక్.ఈ పాట కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. పాటలో కనిపించే విజువల్స్ ప్రేక్షకులకు థియేటర్‌లో మాస్ ట్రీట్ ఇచ్చే విధంగా ఉండబోతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.సినిమా కథ, యాక్షన్‌తో పాటు ఈ పాట కూడా హైలైట్‌గా నిలిచేలా ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ స్పెషల్ సాంగ్‌లో ఎన్టీఆర్‌తో పాటు సినిమాలో కథానాయికలుగా నటిస్తున్న రుక్మిణీ వసంత్, మరో హీరోయిన్ కూడా కలిసి స్టెప్పులు వేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఎన్టీఆర్‌కు మాస్ డ్యాన్స్‌లో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దీంతో ప్రశాంత్ నీల్ మార్క్ మాస్ మేకింగ్‌కు ఎన్టీఆర్ డ్యాన్స్ జోడైతే ఈ పాట అభిమానులకు పండుగలా ఉంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.ముఖ్యంగా భారీ సెట్స్, గ్రాండ్ కొరియోగ్రఫీ, స్టార్ హీరోతో పాటు ఇద్దరు హీరోయిన్ల పెర్ఫార్మెన్స్‌తో ఈ సాంగ్‌ను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం.ఎన్టీఆర్--ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో యాక్షన్ సీక్వెన్స్‌లను అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తారనే విషయం తెలిసిందే. ఈసారి ఎన్టీఆర్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్‌ను మరింత పవర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కథలోని యాక్షన్ ఎపిసోడ్స్, హీరో క్యారెక్టరైజేషన్, భారీ సెట్స్ సినిమాకు ప్రధాన బలాలుగా నిలుస్తాయని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్.

## హాటుగా అదరగొట్టిన ప్రియాంక మోహన్..



# ఆడపిల్లలంటే ఆట వస్తువులు కాదు..

### -అలా చూపిస్తే ఒప్పుకోను..!
### -కాయదు లోహర్ షాకింగ్ కామెంట్స్

ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్రాగన్' చిత్రంతో హీరోయిన్ కయాదు లోహర్ మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతకు ముందుకు ఈ అమ్మడు తెలుగులో అల్లూరి అనే సినిమా చేసింది. కానీ ఆ సినిమా పెద్దగా ఆకట్టుకుకోలేదు. ఇక ఈ చిన్నది ఫంకీ సినిమాతో మరోసారి తెలుగు ఆడియన్స్ ను ఆకట్టుకుంది. కానీ ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేదు. ప్రస్తుతం ఆమె తమిళం, తెలుగు చిత్రసీమలలో చాలా బిజీగా ఉంది. సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. మరోవైపు తెలుగులోనూ బ్యాక్ టూ బ్యాక్ అవకాశాలు అందుకుంటుంది. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమాలో కాయదు హీరోయిన్ గా నటిస్తుంది. ఇదిలా ఉంటే తాజాగా కయాదు లోహర్ చేసిన కొన్ని కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సినిమాల్లో ఆడవాళ్లను చూపించే విధానంపై కయాదు లోహర్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.సినిమాల్లో మహిళలను కేవలం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే ఐటెమ్ లా చూపించే ధోరణిని తాను ఒప్పుకోనని తేల్చి చెప్పింది కాయదు. స్పష్టం చేశారు యంగ్ హీరోయిన్ కయాదు లోహర్. కథ, పాత్ర డిమాండ్ చేస్తే పరిమితులకు లోబడి నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కేవలం లైమ్ లైట్ కోసమో లేదా సోషల్ మీడియాలో ట్రెండ్ అవ్వడానికో అసభ్యకరమైన సన్నివేశాల్లో నటించే ఆలోచన తనకు అస్సలు లేదని చెప్పుకొచ్చింది కయాదు లోహర్. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అస్సాంలో పుట్టి పెరిగినా దక్షిణాది సినిమా ఇండస్ట్రీలో సత్తా చాటుతోంది కాయదు లోహర్. తన అందం, అభినయంతో కుర్రకారులో క్రేజ్ తెచ్చుకుందీ ముద్దుగుమ్మ. మోడలింగ్ తో కెరీర్ మొదలు పెట్టిన కాయదు లోహర్. 'టైమ్స్ ఫ్రెష్ ఫేస్' పోటీల్లో విజేతగా నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించిన కయాదు ఆ తర్వాత నటనారంగం వైపు అడుగులు వేశారు. కన్నడలో 'ముగిల్‌పేటే' చిత్రంతో కెరీర్ ప్రారంభించింది ఈ ముద్దుగుమ్మ ..

# 'ఇరుముడి' నుంచి 'కార్తీకమాసం' వీడియో సాంగ్ విడుదల!




మాస్ మహారాజా రవితేజ హీరోగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి' నుంచి మరో క్రేజీ పాట విడుదలైంది. ఇప్పటికే "మల్లెపూల పల్లకి" వీడియో సాంగ్‌ను విడుదల చేసిన మేకర్స్ తాజాగా మరో పాటను వదిలారు. అయ్యప్ప స్వామి భక్తి దీక్ష విశిష్టతను, ఆధ్యాత్మిక పరివర్తనను అత్యంత హృద్యంగా ఆవిష్కరిస్తూ రూపొందించిన 'కార్తీకమాసం..' అంటూ సాగే పూర్తి వీడియో గీతాన్ని చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ఆధ్యాత్మిక ప్రియులను, ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది.ఈ చిత్రంలో రవితేజ పాత్రలో వచ్చే భావోద్వేగాలు, జీవితంలో అలవాటైన చెడు వ్యసనాలను పూర్తిగా మానుకొని, కఠినమైన అయ్యప్ప దీక్షను భక్తిశ్రద్ధలతో ఎలా కొనసాగించారనే పట్టుదలను ఈ పాటలో దర్శకుడు చాలా చక్కగా చూపించారు. ఒక వ్యక్తి తన అంతరాత్మతో పోరాడుతూ ఆధ్యాత్మిక మార్గం వైపు అడుగులు వేసే ప్రయాణానికి ఈ పాట అద్దం పడుతోంది. సినిమాలోని కథాబలానికి ఈ గీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుందని తాజా వీడియో చూస్తే స్పష్టమవుతోంది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ అందించిన బాణీలు ఈ పాటకు ప్రాణం పోశాయి. హృదయానికి హత్తుకునేలా ఉన్న ట్యూన్స్‌తో పాటు, ఈ పాటకు స్వయంగా దర్శకుడు శివ నిర్వాణ అందించిన సాహిత్యం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తి భావాలతో పాటు జీవిత సత్యాలను ప్రతిబింబించేలా ఉన్న ఈ పదాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. రవితేజ నటన, జీవీ ప్రకాష్ సంగీతం, శివ నిర్వాణ సాహిత్యం-దర్శకత్వం అన్నీ కలిసి ఈ పాన్ని ఒక మ్యూజికల్ మాస్టర్‌పీస్‌గా మలిచాయి

# డిసెంబర్‌లో లెగసీ



విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'లెగసీ'చిత్రాన్ని డిసెంబర్ 4న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. సాయికిరణ్ రెడ్డి దైదా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కలాహి మీడియా సంస్థ నిర్మిస్తున్నది. ఏక్తా రాథోడ్ కథానాయికగా నటిస్తున్నది.శనివారం రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధికారం, కుటుంబం, ప్రేమ, ద్రోహం వంటి అంశాల నేపథ్యంలో ఇంటెన్స్ పొలిటికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: గోవింద్ వసంత, నిర్మాతలు: యశ్వంత్ దగ్గుమాటి, సాయికిరణ్ రెడ్డి దైదా.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365